క్లుప్తంగా

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



జనగామ : జనగామ పట్టణ అభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్ అన్నారు. జనగామ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మహేశ్వర్‌రెడ్డిని శనివారం శివరాజ్‌యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, నాయకులు కళ్యాణి, గాదె పాక రాంచెందర్, మెరుగు బాలరాజు, మల్లారెడ్డి, బొట్ల నర్సింగ రావు, శ్రీనివాస్, శ్రీశైలం, కరుణాకర్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

దొంగ ఓట్లను తొలగించాలి



పాలకుర్తి : మండలంలోని బమ్మెర గ్రామంలో నమోదైన దొంగ ఓట్లను తొలగించాలని అఖిల పక్షం ఆధ్వర్యంలో తహసీల్దార్ నాగేశ్వరచారి, ఎంపీడీఓ రవీందర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, దార శంకరయ్య, పెనుగొండ రమేశ్, ఎడవెల్లి సోమేశ్వర్, వెంకన్న, కమ్మగాని పరమేశ్వర్, గణపతి పాల్గొన్నారు.

విస్నూరులో..

మండలంలోని విస్నూరు గ్రామంలో మృతిచెందిన, రెండు సార్లు ఉన్న పేర్లను తొలగించాలని మాజీ సర్పంచ్ నకీర్త యాకయ్య, మాజీ ఎంపీటీసీ మాటూరి యాకయ్య కోరారు.

జీపీ కార్యదర్శికి తండావాసుల వినతి



పాలకుర్తి మండలంలోని బమ్మెర గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్లమ్మగడ్డ తండా, బాబు నగర్ తండా వాసులు తాము బమ్మెర పరిధిలోనే ఓటర్లుగా ఉంటామని శనివారం గ్రామ పంచాయతీ కార్యదర్శి యుగేందర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బమ్మెర పరిధిలోనే ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు వేయడానికి అనుకూలంగా ఉంటుందని అన్నారు. తండా వాసులు, రమేశ్ తదితరులు ఉన్నారు.

ఓటర్ల జాబితాను సవరించాలి

జఫర్‌గఢ్ : ఒకే కుటుంబం, ఒకే వార్డులో ఉండే విధంగా ఓటర్ల జాబితాను సవరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ సుమన్‌కు శనివారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేష్, సీపీఎం నాయకుడు కాట సుధాకర్ మాట్లాడారు.

వ్యక్తి ఆత్మహత్య



వెంకటాద్రి (ఫైల్)

చిల్పూరు : కుటుంబ కలహాలతో గ్రామ పంచాయతీ కార్మికుడు మోతె వెంకటాద్రి (53) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని లింగంపల్లిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్, మృతుడి భార్య కథనం ప్రకారం.. లింగంపల్లి గ్రామానికి చెందిన వెంకటాద్రి రోజు మద్యంతాగి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. దీంతో ఆమె తల్లిగారింటికి వెళ్లగా గతంలో ఓ సారి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. మారుతాడని ఆమె తిరిగి వచ్చిన వెంకటాద్రి మారలేదు. ఈనెల 27న మళ్లీ మద్యం తాగివచ్చి గొడవ పడడంతో మళ్లీ ఆమె తల్లిగారింటికి వెళ్లిపోయింది. శనివారం ఉదయం ఇంటి పక్కనే ఉంటున్న బాలయ్య లేవకపోవడంతో తలుపు కొట్టగా సమాధానం లేదు. తలుపుతీసి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెంది కనిపించాడు. వెంకటాద్రి మృతిపై ఎలాంటి అనుమానం లేదని మద్యం మత్తులో ఉరి వేసుకుని మృతి చెందాడంటూ మృతుని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అయితే వెంకటాద్రికి గ్రామ సఫాయిగా మంచి పేరు ఉందిన మాజీ సర్పంచ్ ఏదునూరి రవీందర్ అన్నారు. అతడి మృతి పట్ల పంచాయతీ కార్యదర్శి లింగయ్య, కారోబార్ నర్సింహులు తదితరులు సంతాపం తెలిపారు.

కర్రసాయంతో అసెంబ్లీకి..



అసెంబ్లీ సమావేశాలకు వెళ్తున్న ఎమ్మెల్యే పల్లా

జనగామ: కొద్ది రోజుల క్రితం ఎర్రబెల్లి ఫాంహౌజ్‌లో జారిపడి గాయపడ్డ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పూర్తిగా కోలుకున్నారు. శనివారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలకు ఆయన కర్ర(స్టిక్) సహాయంతో నడుచుకుంటూ హాజరయ్యారు. ఆయన్ను పార్టీ ప్రజాప్రతినిధులతో పాటు మంత్రులు, విప్, తదితర నేతలు అసెంబ్లీలో పరామర్శించారు.

యూరియా.. నో స్టాక్

- వరంగల్ బఫర్ నుంచి 100టన్నులు
- మహారాష్ట్రలో నిలిచిన గూడ్స్ రైలు
- నేటికల్లా ఆరువందల టన్నులు దిగుమతి



పాలకుర్తిలో యూరియా కోసం బారులుదీరిన రైతులు (ఫైల్)

జనగామ / పాలకుర్తి టౌన్ : జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో వరి, పత్తి, పెసర, కందులు, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలు 3.40 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఇందుకు 26వేల టన్నుల యూరియా, 5,386 టన్నుల డీఏపీ, 10,599 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అవసరముంటుందని అంచనా వేశారు. సీజన్‌కు ముందు యూరియా కొరత పెద్దగా లేకున్నా.. వినియోగం పెరగడంతో కొరత ఏర్పడింది. దీన్ని అధిగమించేందుకు వ్యవసాయాధికారులు వరంగల్, తదితర ప్రాంతాల నుంచి యూరియా తెప్పిస్తూ అప్పటికప్పుడు సమస్య తలెత్తకుండా చూడగలిగారు. జిల్లాలో 246 ప్రైవేట్ ఫర్టిలైజర్స్, 60 పీఏసీఎస్, ఆగ్రోస్, ఓడీసీఎంఎస్, ఇతర సొసైటీలు ఉన్నాయి.

లోడ్ వస్తున్న గూడ్స్ రైలు నిలిపివేతతో ఆలస్యం

భారీ వర్షాలతో ఉత్తర భారత్ నుంచి యూరియా లోడ్‌తో వరంగల్-జనగామ జిల్లాలకు వస్తున్న గూడ్స్‌రైలును మహారాష్ట్రలో నిలిపివేశారు. ఈనెల 26, 28 తేదీల్లో ఆరువందల టన్నుల (వేర్వేరుగా) యూరియాతో రెండు రైళ్లు బయలు దేరగా, ఐదు రోజులుగా అక్కడే నిలిపి వేశారు. నేటి (ఆదివారం) సాయంత్రం వరకు గూడ్స్ రైళ్లు వరంగల్‌కు చేరుకునే అవకాశం ఉందని వ్యవసాయధికారులు భావిస్తున్నారు. రెండు, మూడ్రోజులుగా జిల్లాలో యూరియా స్టాక్ లేకపోవడంతో రైతుల నుంచి ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయనే ఉద్దేశంతో వరంగల్ గోదాంలో బఫర్‌లో ఉన్న 100 టన్నులు తెప్పించి విక్రయించారు. మహారాష్ట్ర నుంచి యూరియా వచ్చిన వెంటనే జిల్లాలోని పీఏసీఎస్, ఆగ్రోస్, ఫర్టిలైజర్స్, ఓడీసీఎంఎస్, తదితర వాటికి కేటాయిస్తారు. ఇదిలాఉండగా ఆధార్ కార్డు ఆధారంగా ఒక ఎకరాకు ఒకటి, ఎకరాకుపైగా రెండు బ్యాగుల యూరియా మాత్రమే ఇస్తున్నారు. ఆధార్ కార్డుకు పట్టాదారు పాస్‌బుక్ లింకు లేకపోవడంతో రైతులతో పాటు వ్యవసాయేతర వ్యక్తులు (ప్రైవేటు) సైతం దీని ద్వారా యూరియాను కొనుగోలు చేస్తూ అసలు రైతుల కొరతకు కారణం అవుతున్నారనే ప్రచారం ఉంది.

జిల్లాలో స్టాక్ పాయింట్‌కు సన్నాహాలు

జిల్లాలో వరంగల్ తరహా యూరియా స్టాక్ పాయింట్ గోదాంకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం వరంగల్ గోదాం నుంచి తెప్పించుకుంటుండంతో అత్యవసర సమయంలో బఫర్ స్టాక్ లేకుండా పోతోంది. ఇందుకు జనగామ లేదా పక్క మండలాల పరిధిలో ప్రస్తుతం ఉన్న గోదాం, కొత్తగా నిర్మాణం చేయాలనే దానిపై కలెక్టర్ నేతృత్వంలో సర్కారుకు నివేదిక పంపించనున్నారు.

నేడు 600 టన్నుల యూరియా..



జనగామకు ఉత్తర భారతం నుంచి యూరియా రావాల్సి ఉంది. భారీ వర్షాలతో యూరియా లోడ్‌తో వస్తున్న రెండు గూడ్స్ రైళ్లను మహారాష్ట్రలో నిలిపివేశారు. రైతులు అందుబాటులో ఉన్న నానో యూరియాను వాడుకోవచ్చు. దీనిని ఆకులకు స్ప్రే చేస్తే మొక్క వరకు వెళ్తుంది. యూరియా కొరతను అధికమించేందుకు అందుబాటులో ఉన్న నానోను మొక్కలకు అందించడం మేలు.

– అంబికా సోని, జిల్లా వ్యవసాయాధికారి

పాలకుర్తి టౌన్ : కళా ఉత్సవ్‌లో విద్యార్థులు



స్టేషన్‌ఘన్‌పూర్‌లో..



కళా ఉత్సవ్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత



జనగామ రూరల్: కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

కళా ఉత్సవ్ పోటీలతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని ఆయా మండల విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. శనివారం జనగామ రూరల్, స్టేషన్‌ఘన్‌పూర్, కొడకండ్ల, దేవరుప్పుల, పాలకుర్తి టౌన్, లింగాలఘణపురం, తరిగొప్పుల మండల కేంద్రాల్లో కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. – సాక్షి నెట్‌వర్క్



కొడకండ్ల: సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థినులు

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

స్టేషన్‌ఘన్‌పూర్ : మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని ఐకేపీ డీపీఎం సతీష్, ఎంపీడీఓ విజయశ్రీ అన్నారు. స్వర్ణ విజయ మండల సమాఖ్య 18వ వార్షికోత్సవ మహాసభను స్థానిక రైతువేదికలో శనివారం నిర్వహించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు బేతి మంజుల అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. ముందుగా గతేడాదిలో సమాఖ్య ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. గ్రామ, మండల సమాఖ్య కార్యక్రమాలను సక్రమంగా చేపడుతు సంబంధిత వివరాలను రిజిస్టర్లను క్రమపద్ధతిలో నిర్వహించాలన్నారు.

‘పోరాటయోధుడు సీతారాం ఏచూరి’

జనగామ రూరల్ : పోరాటయోధుడు సీతారాం ఏచూరి అని, ఆయన ఆశయబాటలో ప్రతి ఒక్కరూ నడవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ అన్నారు. ఏచూరి జయంతి ఉత్సవాల సందర్భంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని పూసల భవనంలో ఇర్రి అహల్య అధ్యక్షతన భారత రాజ్యాంగం-ఎన్నికలు, కేంద్ర ప్రభుత్వం అక్రమంగా ఓట్ల తొలగింపుపై సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజల స్వేచ్ఛను హరిస్తోందన్నారు. జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, సింగారపు రమేశ్, రాపర్తి సోమయ్య, బొట్ల శేఖర్, ప్రకాశ్ పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలియజేయండి

సాక్షి నెట్‌వర్క్ : ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఆయా మండలాల ఎంపీడీఓలు రాజకీయ నాయకులను కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయాల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. ఓటరు జాబితాలో తప్పులుంటే సరిచేసుకోడానికి సెప్టెంబర్ 2వ తేదీ వరకు అవకాశం ఉందని అన్నారు. ఆయా సమావేశాల్లో చిల్పూరు ఎంపీఓ మధుసూదన్, పాలకుర్తి ఎంపీడీఓ రవీందర్, తహసీల్దార్ నాగేశ్వరాచారి,కొడకండ్ల ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి,జఫర్‌గఢ్ ఎంపీడీఓ సుమన్, దేవరుప్పుల ఎంపీడీఓ టి.సురేష్‌కుమార్,లింగాలఘణపురం ఎంపీడీఓ రఘురామకృష్ణ, నర్మెట ఎంపీడీఓ అరవింద్ చౌదరి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



నర్మెట: మాట్లాడుతున్న ఎంపీడీఓ అరవింద్



చిల్పూరు: సమావేశంలో ఎంపీఓ, నాయకులు

పాదయాత్రను జయప్రదం చేయండి



ముఖ్య కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే రాజయ్య

చిల్పూరు : అన్ని గ్రామాలకు సాగునీరు అందించాలనే డిమాండ్‌తో రైతుల కోసం నేడు చేపట్టనున్న పాదయాత్రను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య పిలుపునిచ్చారు. మండలంలోని శ్రీపతిపల్లిలో పార్టీ నియోజకవర్గం నాయకుడు కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి నివాసంలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేలేరు నుంచి ప్రారంభించే పాదయాత్ర మధ్యాహ్నం మండలంలోని కొమ్ముగుట్టకు చేరుకుంటుందని, కొండాపూర్, లింగంపల్లి, మల్కాపూర్ రైతులు అక్కడికి చేరుకోవాలని కోరారు. అనంతరం లింగంపల్లి, ఫత్తేపూర్, గార్లగడ్డతండాలోని గండి రామారం (మల్లన్నగండి) రిజర్వాయర్ కట్టపై సభ ఉంటుందన్నారు. కాగా మల్కాపూర్ గ్రామానికి చెందిన కలకొల్ల కొమురమ్మ అనారోగ్యంతో మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే రాజయ్య దహన సంస్కారాల్లో పాల్గొన్నారు. నాయకులు జనగాం యాదగిరి, మాలోత్ రమేష్ నాయక్, వెన్నం మాధవరెడ్డి, వేముల రవి, రంగు హరీష్, గాలి ప్రవీణ్, కంకటి రవీందర్,రచ్చ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనం నడపొద్దని తీర్మానం

బచ్చన్నపేట : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో మైనర్లు వాహనాలు నడపొద్దని గ్రామస్తులు శనివారం తీర్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల దృష్ట్యా గ్రామ పెద్దలు, యువకులంతా పలు నిర్ణయాలను తీసుకొని తీర్మానం చేశామన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి ఫొటో తీసి వాట్సప్ గ్రూపులో పెట్టాలని అప్పుడు వారికి రూ.లక్ష జరిమానా విధిస్తామని తెలిపారు. అనంతరం పోలీస్ శాఖకు అప్పగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాతిరెడ్డి శశిధర్‌రెడ్డి, శ్రీరాముల కనుకయ్య, కిష్టయ్య, గొల్లపల్లి మల్లేశం, సయ్యద్, బాల కిషన్, రాజు, మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న ఎస్సై రాజేష్



బచ్చన్నపేట: మాట్లాడుతున్న డీటీ శంకర్

స్టేషన్‌ఘన్‌పూర్ : చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని ఎస్సై రాజేష్ అన్నారు. మండలంలోని కొత్తపల్లి ఎస్సీ కాలనీలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై హాజరై మాట్లాడారు. అందరూ తమ హక్కులతో పాటు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. ఏమైనా సమస్యలుంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, చట్ట విరుద్ధంగా ఎలాంటి కార్యక్రమాలు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో డీటీ సంధ్యారాణి, ఆర్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

హక్కులకు భంగం కలిగించొద్దు..

బచ్చన్నపేట: ప్రతి పౌరుడు హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తమ హక్కులకు భంగం కలిగితే ఉపేక్షించొద్దని నాయబ్ తహసీల్దార్ శంకర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కేసిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలు కుల వివక్షకు గురైతే వెంటనే ఫిర్యాదు చేయాలని అన్నారు. ఆర్ఐ వంశీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నర్సింహాచారి, కారోబార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్కరాజుపల్లిలో సివిల్ రైట్స్‌డే

తరిగొప్పుల : మండలంలోని అక్కరాజుపల్లి గ్రామంలో శనివారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ ఆంధ్రయ్య మాట్లాడుతూ సమాజంలో ప్రతీ ఒక్కరు సమానమే అని అన్నారు.పంచాయతీ కార్యదర్శి రత్న పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు సిగ్గుచేటు



జనగామ రూరల్: రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



జఫర్‌గఢ్‌లో..



బచ్చన్నపేట: పోలీసుల అదుపులో నాయకులు



పాలకుర్తి టౌన్‌లో..

సాక్షి నెట్‌వర్క్ : బిహార్ ఎన్నికల వేళ ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాతృమూర్తిపై రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, తక్షణం ఆయన క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ డిమాండ్ చేశారు. శనివారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు అనిల్‌గౌడ్ ఆధ్వర్యంలో అలాగే పలు మండల కేంద్రాల్లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రధాని మోదీ తల్లి గురించి, వారి కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ మాట్లాడడం సిగ్గుచేటని పేర్కొన్నారు. అలాగే రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మను దహనం చేయడానికి బీజేపీ నా యకులు ప్రయత్నించగా వారిని పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

సంక్షిప్త సమాచారం

కృత్యమేళాతో నైపుణ్యాలు

కొడకండ్ల : ఉపాధ్యాయులు తమ వృత్తిలో నైపుణ్యాన్ని మెరుగు పర్చుకొనేందుకు కృత్యమేళా దోహదపడుతుందని ఏఎంఓ బొమ్మనబోయిన శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల టీఎల్ఎంను ఆయన సందర్శించి ఉపాధ్యాయుల కృత్యాలను పరిశీలించి విజేతలకు బహుమతులు అందజేశారు.

చిల్పూరు ఆలయంలో వార కల్యాణం



చిల్పూరు : బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వార కల్యాణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉదయం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాలతో స్వామి వారి వార కల్యాణం నిర్వహించారు. భక్తులకు ఆలయ ఈఓ లక్ష్మిప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో పల్లగుట్టకు చెందిన కడారి దిలీప్‌రెడ్డి-కల్పన, శౌర్యశోభిత్‌రెడ్డి, జయపాల్‌రెడ్డిలు అన్నప్రసాదం వితరణ చేశారు.

పిచ్చిమొక్కల తొలగింపు

చిల్పూరు : మండలంలోని పల్లగుట్ట గ్రామానికి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని ఇటీవల చిల్పూరు ఆలయ చైర్మన్ ఆధ్వర్యంలో రైతులు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే స్థల సేకరణ చేస్తే మంజూరుకు అనుమతులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. దీంతో శనివారం శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో గ్రామ సమీపంలోని కుమ్మరి కుంటలో స్థల సేకరణ చేయడంతో పాటు పొక్లెయినర్‌తో పిచ్చి మొక్కలను తొలగించారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి

పాలకుర్తి టౌన్ : కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యమకారులను ఆదుకుంటామని ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు దేవ్‌సింగ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సాధనకు ఉద్యమాలు చేసి జైలుకు వెళ్లిన ఉద్యమకారులను ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్ : మార్కెట్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కమిటి ఆధ్వర్యంలో మార్కెట్ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య, పట్టణ కార్యదర్శి మంగ భీరయ్య, నక్క యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేస్తేనే గుర్తింపు

బచ్చన్నపేట : ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పని చేసినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో టైపిస్టుగా పని చేసిన పబ్బరాజు కృష్ణవేణి పదవీ విరమణ సమావేశాన్ని మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమెను సన్మానించి మెమొంటో అందించారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

స్టేషన్‌ఘన్‌పూర్ : ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, ఎస్‌డీఎల్‌సీఈ మాజీ డైరెక్టర్ ఎర్రగట్టు స్వామి, వాగ్దేవి విద్యాసంస్థల అధినేత దేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాటికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోషల్ స్టడీస్ ఉపాధ్యాయురాలు రుద్రమదేవి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయురాలు రుద్రమదేవి దంపతులను అతిథులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు శాలువాలతో సన్మానించారు.

ప్రతిభ చూపిన విద్యార్థికి పారితోషికం

జఫర్‌గఢ్ : మండలంలోని హిమ్మత్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో స్కూల్ టాపర్‌గా నిలిచి బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థి ఎర్ర అర్చనను శనివారం సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీటీసీ యార నీలమ్మసోమిరెడ్డి హాజరయ్యారు. అనంతరం రూ.3వేల పారితోషికం అందజేశారు. హెచ్‌ఎం జయప్రకాశ్ కూడా విద్యార్థికి రూ.1,000 పారితోషికాన్ని అందజేశారు.

పాలకుర్తిలోనే ఏర్పాటు చేయాలి

పాలకుర్తి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను పాలకుర్తిలోనే ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మారం రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఏఎన్‌ఎంలకు పని ఒత్తిడి తగ్గించాలి

జనగామ రూరల్ : తమకు పని ఒత్తిడి తగ్గించాలని శనివారం డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్ రావుకు ఏఎన్‌ఎంలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకురాలు పద్మావతి మాట్లాడుతూ..ఆన్‌లైన్‌లో ప్రోగ్రాంలు స్క్రీనింగ్ టెస్టెట్‌లతో పాటు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రిపోర్ట్‌లు ఇవ్వడం పనికి మించిన భారం అవుతుందన్నారు.

నర్సింహారెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు

దేవరుప్పుల : లేగ నర్సింహారెడ్డి అకాల మరణం తీరని లోటని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. శనివారం సీర్మాలలో నర్సింహారెడ్డి మృతి చెందగా బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించి సంతాపం తెలిపారు.

జాబితా నుంచి ఓటు తొలగించారు



జనగామ : భారత ఎన్నికల సంఘం ఓటు హక్కు కల్పిస్తే ముసాయిదా ఓటరు జాబితాలో తన పేరు లేదని జనగామ మండలం పెంబర్తి గ్రామానికి చెందిన అంబాల శివ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. డీఎఫ్‌వై2520328 నంబర్‌తో ఓటు హక్కు కల్పిస్తూ కార్డును జారీ చేసినట్లు చెప్పారు. ఎన్నికల సంఘం సవరించి తన పేరును జాబితాలో వచ్చే చూడాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రఘునాథపల్లి : మండలంలోని ఫత్తేషాపూర్ ఎస్సీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు లింగాల జగదీశ్ చందర్‌రెడ్డి ప్రారంభించారు. నాయకులు భాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గుజ్జుల మహేష్, హయత్ అలీ, విరోజి, కరుణాకర్‌రెడ్డి, మహేందర్, సత్యనారాయణ, తిరుపతి పాల్గొన్నారు.

తిథి భోజనం ఏర్పాటు

బచ్చన్నపేట : మండలంలోని బండనాగారం గ్రామానికి చెందిన ఇజ్జగిరి రోహిత్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు భోజనం కల్పించారు. శనివారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసి తిథి భోజనం ఏర్పాటు చేశారు.

బైక్ దొంగ అరెస్ట్

దేవరుప్పుల : ఓ ఇంటి ఎదుట ఉన్న బైక్‌ను ఎత్తుకెళ్లిన దొంగను 24 గంటల్లోనే అరెస్టు చేసినట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. ఈనెల 29న ధరావత్‌తండాలో వాంకుడోత్ దేవానాయక్ తన ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్‌ను తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా గాలింపు చర్యలు చేపట్టారు. బైక్ దొంగిలించిన వ్యక్తి సూర్యాపేట జిల్లా శాలిగౌరారం మండలం మనిమద్దె గ్రామానికి చెందిన శివరాత్రి పవన్‌గా గుర్తించి సింగరాజుపల్లి టోల్‌గేట్ వద్ద శనివారం పట్టుకు న్నారు. చాకచక్యంగా వ్యవహరించి దొంగను పట్టుకున్న ఎస్సై, కానిస్టేబుళ్లు అశోక్, యాకూబ్, యాకేశ్, ఏఓ సల్మాన్ పాషాను డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ నర్సయ్య, సీఐ జానకిరామ్‌రెడ్డి అభినందించారు.

మహా అన్నదానం



దేవరుప్పుల : మండల కేంద్రంలోని చౌరస్తాలో గణపతి ఉత్సవాల సందర్భంగా భావ్‌సింగ్ అండ్ సన్స్ ఆధ్వర్యంలో శనివారం మహా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ మాట్లాడుతూ.. అన్నదానం చేయడం అభినందనీయమన్నారు.

తరిగొప్పుల : మండల కేంద్రంలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శనివారం అన్నదానం నిర్వహించారు.

ఘనంగా కుంకుమ పూజలు

స్టేషన్‌ఘన్‌పూర్ : ఘన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని శివునిపల్లి బరోడా బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర మండపం వద్ద, తాటికొండలో స్నేహయూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద మహిళలు సామూహిక కుంకుమపూజ నిర్వహించారు. అనంతరం అన్నదానాలు చేపట్టారు.